# నమస్తే తెలంగాణ
# ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ బుధవారం 4 డిసెంబర్ 2024 | ADILABAD NIRMAL


### ❖ డబ్బులు పడుతాయని బ్యాంకు చుట్టూ తిరుగుతున్న..



ఖానాపూర్, డిసెంబర్ 3 : నేను ఖానాపూర్ పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకులో రూ.2.40 లక్షల పంట రుణం తీసుకున్నా. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తానని చెప్పి ఇప్పటికీ చేయలేదు. చాలా సార్లు వ్యవసాయశాఖ కార్యాలయం, బ్యాంకు చుట్టూ తిరిగిన ఫలితం లేదు. నాలుగో విడుతలో మాఫీ చేస్తానని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిండు. కానీ.. ఇంతవరకు డబ్బులు పడలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం మాఫీ చేసి పేద రైతులను ఆదుకోవాలి.

**- బోరువంతుల చిన్న రాజన్న, రైతు, తర్లపాడు**

### ❖ రూ.53 వేలు కూడా మాఫీ కాలే



నాకు ఒక ఎకరం ఎనిమిది గుంటల భూమి ఉంది. నేను దక్కన్ గ్రామీణ బ్యాంకులో రూ.55 వేల రుణం తీసుకున్నా. నిన్న, మొన్నటి వరకు ఐతదనుకున్నా.. కానీ కాలేదు. అమ్మ పేరు మీద మూడెకరాల భూమి ఉంది. ఆమె పేరు మీదున్న రూ.1.28 లక్షలు మాఫీ వచ్చింది. ఒకే రేషన్ కార్డు ఉన్నప్పటికీ రూ.2 లక్షల లోపే రుణం ఉంది. అయినప్పటికీ మాఫీ కాలేదు. నాకే కాదు గ్రామంలోని చాలా మంది రైతులకు బుట్టదాఖలు చేసింది ప్రభుత్వం. ఇప్పటికైనా అర్హులందరికీ రుణమాఫీ చేయకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో బొక్క బోర్లా పడడం ఖాయం.

**- బుర్పెల్లి మహేశ్, రైతు, కుభీర్, నిర్మల్ జిల్లా**

### హరీశ్‌రావును కలిసిన మాజీ మంత్రి



ఎమ్మెల్యే హరీశ్‌రావును కలిసిన మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, డిసెంబర్ 3 ః మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావును మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న మంగళవారం హైదరాబాద్‌లో హరీశ్‌రావును ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం హరీశ్‌రావుతో పలు విషయాలపై చర్చించారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని, ముందు రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడుతుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన జిల్లాలవారీగా అనేక కార్యక్రమాలను తీసుకోవడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో బట్టు సతీష్, ఉగే విఠల్ పాల్గొన్నారు.

### ❖ గిరిజనులు రైతులు కాదా?



కుభీర్, డిసెంబర్ 3 ః భూమిని నమ్ముకుని జీవిస్తున్న గిరిజనులమైన తాము రైతులము కాదా? మాకు రుణమాఫీ వర్తించదా? మాది కుభీర్ మండలంలోని పార్డి(కె) తండా. నాకు నాలుగెకరాల వ్యవసాయ భూమి ఉంది. అనాదిగా వ్యవసాయం చేస్తూ జీవనాన్ని సాగిస్తున్నాం. నేను కుభీర్‌లోని యూనియన్ బ్యాంకులో రూ.2 లక్షల రుణం తీసుకున్నా. నేను రెగ్యులర్ రైతుని అయినప్పటికీ నాకు రుణమాఫీ రాలేదు. నాతోపాటు మా తండాలోని 12 మంది గిరిజన రైతులకు ఎవరికీ కాలేదు. ఐతే ప్రభుత్వం వ్యవసాయం చేస్తూ జీవించే వారికి కాకుండా దొంగలకా రుణమాఫీ చేసేది. చాలా బాధనిపిస్తుంది. అందరిరీ రుణ మాఫీ చేశామని సీఎం రేవంత్‌రెడ్డి చేతులు దులుపేసుకున్నారు. ఇదెక్కడి న్యాయం.

**- రాథోడ్ రతన్, రైతు**

# రిక్తహస్తం



## కుటుంబ నిర్ధారణ సర్వే చేసినా
## సగం మందికి కాని రుణమాఫీ

- **అన్ని అర్హతలున్నా రాని వైనం**
- **ఉమ్మడి జిల్లాలో వేలాది మంది ఎదురుచూపు**
- **సాకులు చెప్పి మోసం చేశారంటూ అన్నదాతల ఆవేదన**
- **న్యాయం చేయాలని వేడుకోలు**

మంచిర్యాల, డిసెంబర్ 3(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రూ. రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామంటూ చెప్పుకొచ్చిన సర్కారు.. చివరకు అనేక మంది కర్షకులకు రిక్త'హస్తం'చూపించింది. రేషన్ కార్డులు లేవని.. రుణం ఎక్కువ ఉందని.. ఇలా ఏవేవో కారణాలు చెప్పి.. సర్వే చేపట్టి కాలయాపన చేసింది. ఇక చివరకు రుణమాఫీ 100 శాతం పూర్తయ్యిందని చేతులెత్తేసింది. అన్ని అర్హతలున్నా తమకు రుణం మాఫీ కాలేదని.. ప్రభుత్వం తమను మోసం చేసిందంటూ రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది.

కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి రాగానే విడుతల వారీగా రూ. రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పుకొచ్చింది. ఈ క్రమంలో ఆగస్టులో మూడో విడుత విడుదల చేసింది. ఇందులో అనేక మంది అర్హులకు రుణమాఫీ కాకపోవడంతో వారంతా ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టారు. దీంతో స్పందించిన సర్కారు రేషన్ కార్డు లేని వారికి. రూ. రెండు లక్షల కంటే ఎక్కువ ఉన్నవారికి రుణం మాఫీ కాలేదని.. రూ. రెండు లక్షలకు పైగా రుణం ఉన్నవారు... మిగతా డబ్బు కట్టాలని స్పష్టం చేసింది. ఆపై రేషన్ కార్డులు లేని వారి కోసమంటూ కుటుంబ నిర్ధారణ సర్వే మొదలు పెట్టింది. మూడు నెలల పాటు కాలయాపన చేసింది. ఇక చివరకు ఇటీవల నాలుగో విడుత రుణమాఫీ (100 శాతం) పూర్తయ్యిందని ప్రకటించింది. అన్ని అర్హతలున్నా తమకు రుణమాఫీ కాలేదని.. సర్వే పేరిట సర్కారు తమను మోసం చేసిందని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### సర్వే చేసినా సగం మందికి రాలే..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రేషన్ కార్డు (కుటుంబ నిర్ధారణ) లేక వేలాది మంది రైతులకు రుణమాఫీ కాలేదు. ఆదిలాబాద్ జిల్లాలో 18,000, నిర్మల్ జిల్లాలో 13,433 మంది రైతులు, మంచిర్యాల జిల్లాలో 15,542 మంది రైతులకు కుటుంబ నిర్ధారణ లేక రుణమాఫీ కాలేదు. కాగా, ఆదిలాబాద్ జిల్లాలో 6,600 మందికి, నిర్మల్ జిల్లాలో 6,823 మందికి, మంచిర్యాల జిల్లాలో 8,195 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ అయ్యింది. అంటే ఈ లెక్కన రుణమాఫీ అవుతుందని ఆశపడి, రైతు వేదికల చుట్టూ, గ్రామ పంచాయతీల చుట్టూ తిరిగి మరీ సర్వే చేయించుకున్న సగం మందికి కూడా రుణమాఫీ కాలేదు. అలాంటప్పుడు సర్వే ఎందుకు చేశారంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. రేషన్ కార్డు లేదనే కారణంతో నాలుగో విడుత పూర్తయ్యాక కూడా రుణమాఫీ కాని రైతులు ఎంతో మంది ఉన్నారని వాపోతున్నారు. రూ.రెండు లక్షల లోపు రుణం ఉండాలని చెప్పడంతో.. అంతకు మించి ఉన్న రైతులు ఆ డబ్బు కట్టినా కూడా రుణమాఫీ కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతున్నది.

### కారణాలెన్నో..

సర్వేలో పాల్గొన్న కుటుంబాలకు రుణమాఫీ ఎందుకు కాలేదంటే అధికారులు ఎన్నో కారణాలు చెబుతున్నారు. ''రేషన్ కార్డు లేని రైతులు కుటుంబాలపై సర్వే చేశాం. ఆధార్‌కార్డు నంబర్ల ఆధారంగా వివరాలు తీసుకొని ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. రేషన్‌కార్డులో ఉన్న తప్పులు కాకుండా బ్యాంక్ పాస్‌బుక్‌లలో ఉన్న తప్పులను బ్యాంక్ వాళ్లే సరిచేశారు. అలాంటి వారికి రుణమాఫీ అయ్యింది. సర్వేలో పాల్గొన్నక కూడా రుణమాఫీ కాలేదంటే కచ్చితంగా ప్రభుత్వ ఉద్యోగులు ఎవరో ఆ కుటుంబాలోఉండి ఉండాలి. లేదా రూ. రెండు లక్షల కంటే ఎక్కువ రుణం ఉండి ఉండాలి. ఈ రెండు కాకపోతే లోన్ రెన్యూవల్ చేయక మూడేళ్లు దాటి ఉండాలి. ఇలాంటి రైతులకే రుణమాఫీ కాలేదు' అని అధికారులు అంటున్నారు. మరి అన్ని అర్హతలు ఉండీ మాఫీ కాని వారు ఏం చేయాలి అంటే మాత్రం అధికారుల నుంచి స్పష్టమైన సమాధానం రావడం లేదు. ఈ నేపథ్యంలో రుణమాఫీ కాని రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలంటూ రైతులు డిమాండ్ చేస్తున్నారు. అన్ని అర్హతలు ఉన్నా మాఫీ కాలేదంటూ గోడు వెల్లబోసుకుంటున్నారు.

### ❖ రుణమాఫీ కాలే



తాంసి(భీంపూర్), డిసెంబర్ 3 ః నా పేరిట నాలుగెకరాలు, భార్య వాణిశ్రీ పేరిట మూడెకరాల వ్యవసాయ భూమి ఉన్నది. ఇందులో యేటా పత్తి, కంది సాగు చేస్తాం. మా ఇద్దరికీ అర్లి(టీ) తెలంగాణ గ్రామీణ బ్యాంకులో పంట రుణం ఖాతాలు ఉన్నాయి. వడ్డీతో కలిసి నా రుణం రూ.2 లక్షలు కాగా.. నా భార్య రుణం రూ.1.50 లక్షలు ఉన్నది. ఇందులో ఏ ఒక్కరిది మాఫీ కాలేదు. కేసీఆర్ సార్ సీఎంగా ఉన్నప్పుడు రుణమాఫీ, రైతుబంధుకు ఇన్ని సాకులు చెప్పలేదు. మొన్నటి ఆఖరి జాబితా మా గ్రామం నుంచి ఒక్క రైతు రుణమన్నా మాఫీ అయితే ఒట్టు. పాలకులకు రైతుల ఉసురు తగుల్తది. నేనే గాదు మా గ్రామం రైతులంతా వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే అంటున్నరు.

**- గడ్డం రవీందర్ రెడ్డి, రైతు, గుబిడి గ్రామం, భీంపూర్ మండలం**

### ❖ ఇగ కాంగ్రెస్ మళ్లీ రాదు..



మొన్నటి ఆఖరి లిస్టులసుకా నాకు రుణమాఫీ కాలే. ఇగ కానే కాదని నాకు తెలుసు. మాఫీ కాని బాధిత రైతులందరికి కూడా తెలుసు. కరంజి శివారుల నాకు, నా భార్య పేరిట మొత్తం కలిపి ఆరెకరాల భూమి ఉన్నది. అందులో పత్తి పంట తీస్తున్నం. మా ఇద్దరికీ కలిపి అర్లి తెలంగాణ గ్రామీణ బ్యాంకుల రెండు లక్షల యాభైవేల బాకీ ఉన్నది. వడ్డీలు కట్టి రెన్యూవల్ చేసుకున్నా లాభం లేకుంట అయింది. అసలు కాంగ్రెస్ సర్కార్ రుణమాఫీకి పెట్టిన నిబంధనలే మంచిగ లేవు. ఇప్పుడు రైతుబంధు రాక, రుణమాఫీ కాక ప్రతి రైతుకు కేసీఆర్ సార్ యాదికస్తున్నడు. ప్రమాణం జేసీ చెబుతున్న మళ్లీ కాంగ్రెస్ రాదంటే రాదు అదంతే.

**- రెడ్డి దేవన్న, చిన్నకారు రైతు, కరంజి(టీ), భీంపూర్ మండలం**

# ఏడాదిలో ఎనలేని అభివృద్ధి

- **మండల బీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు**
- **బోథ్ నియోజకవర్గంలో వంద కోట్ల ప్రగతి**
- **మండల కన్వీనర్, మాజీ ఎంపీపీలు..**

నేరడిగొండ, డిసెంబర్ 3 : బోథ్ ఎమ్మెల్యేగా అనిల్ జాదవ్ గెలిచి నేటికి ఏడాది కావస్తుండగా నియోజకవర్గంలో ఎనలేని అభివృద్ధి జరిగిందని బీఆర్ఎస్ మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యేగా గెలిచి ఏడాది కావస్తుండడంతో బీఆర్ఎస్ శ్రేణులు నేరడిగొండలో సంబురాలు చేసుకున్నాయి. టపాసులు కాల్చి, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి యేడాది కాలంగా వంద కోట్లు తీసుకొచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. మారుమూల గ్రామాలకు సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు(హైమాస్ లైట్లు), చెక్‌డ్యాంలు, సవారీ బంగ్లా షెడ్లు వంటి ఎన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ప్రజల ఆదరాభిమానాలను చూరగొంటూ వారి సమస్యలను పరిష్కరించడంతో ఎమ్మెల్యే అగ్రస్థానంలో ఉన్నారని పేర్కొన్నారు. ఈ శుభ సమయంలో పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి, టపాసులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. అలాగే మండలంలోని లింగట్ల గ్రామంలో పార్టీ నాయకులు సాబ్లె నానక్‌సింగ్ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అంబేకర్ పండరి, వైస్ ఎంపీపీ మహేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సావాయిరాం, నాయకులు జాదవ్ ధన్‌రాజ్, రాథోడ్ సురేందర్, ఉప్పు పోశెట్టి, సాయిరాం, ముండే పాండురంగ్, శ్రీనివాస్‌రెడ్డి, జాదవ్ గణేశ్, మదన్‌సింగ్, పాండు, కరణ్‌సింగ్ పాల్గొన్నారు.



నేరడిగొండలో సంబురాలు చేసుకుంటున్న పార్టీ శ్రేణులు

# బీఆర్ఎస్‌వీ అంటే.. రేవంత్‌రెడ్డికి భయమెందుకు?

- **గురుకులాల్లో సమస్యలు బయట పడుతాయనా?**
- **బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి ఫారిజ్ హైమద్**



మైనార్టీ గురుకులం ప్రధాన గేటువద్ద బీఆర్ఎస్వీ హెల్ప్‌లైన్ నంబర్లను అతికిస్తున్న నాయకులు

ఎదులాపురం, డిసెంబర్ 3 : బీఆర్ఎస్‌వీ అంటే సీఎం రేవంత్‌రెడ్డికి ఎందుకు భయం. గురుకులాల్లో విద్యార్థులు ఎందుర్కొంటున్న సమస్యలు బయటపడుతాయనే భయం పట్టుకుందని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి ఫారిజ్ హైమద్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చాందా(టి)లో గల బాలుర మైనార్టీ రెసిడెన్షియల్‌ను బీఆర్ఎస్ గురుకుల బాటలో భాగంగా తనిఖీకి వెళ్లారు. ముందుగా అక్కడే పోలీసులు ఉండడంతో వారిని లోనికి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. లోనికి వెళ్లడానికి అనుమతి లేదని, ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని రూరల్ ఎస్సై ముజాహిద్ వారికి సూచించారు. పోలీసులతో మాట్లాడి విద్యార్థులు సమస్యలను తెలియజేయడానికి బీఆర్ఎస్‌వీ హెల్ప్‌లైన్ నంబరు తీసుకొచ్చిందని, దానిని ప్రదర్శించడానికి అవకాశం ఇవ్వాలని కోరారు. పాఠశాల ప్రిన్సిపాల్ బీఆర్ఎస్‌వీకి గురుకులం తనిఖీకి అనుమతి లేదని సూచించారు. దీంతో హెల్ప్‌లైన్ నంబర్ల స్టిక్కర్లను గోడపై అతికించి గేటు ఎదుట ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాజిదొద్దీన్, సలీం పాషా, బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్, నాయకులు ప్రశాంత్, సలీం పాల్గొన్నారు.



మైనార్టీ వసతిగృహంలో వెళ్లకుండా అడ్డుకుంటున్న పోలీసులు

### శ్రీకాంతాచారి వర్ధంతి

తెలంగాణ మలిదశ ఉద్యమంలో తొలి అమరుడు శ్రీకాంతాచారి వర్ధంతిని పురస్కరించుకుని బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. బస్టాండ్ ఎదుట గల శ్రీకాంతాచారి విగ్రహం ఎదుట ఆయన చిత్రపటానికి బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి ఫారిజ్ హైమద్ పూలమాల వేసి నినాదాలు చేశారు. ఉద్యమంలో విద్యార్థులు, యువకుల బలిదానాలను కొనియాడుతూ నివాళులర్పించారు.

# అదిగో పులి

- **పత్తి రైతుల పరేషాన్.. సౌండ్ బాక్స్‌లతో శబ్దాలు**
- **సాయంత్రం తొందరగా ఇంటికి తిరుగు ప్రయాణం**

ఆదిలాబాద్, డిసెంబర్ 3(నమస్తే తెలంగాణ) ః ఆదిలాబాద్ జిల్లాలో పులి సంచారం వదంతుల నేపథ్యంలో పత్తి రైతులు అవస్థలు పడుతున్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పత్తి ఏరుతున్న ఇద్దరిపై పులి దాడి చేసింది. ఇందులో ఒక మహిళా రైతు మరణించగా, మరో రైతుకు గాయాలయ్యాయి. జిల్లాకు ఆనుకుని మహారాష్ట్ర తిప్పేశ్వర్ రిజర్వు ఫారెస్టు ఉంది. ఈ అడవిలో పులుల సంఖ్య అధికంగా ఉండడంతో ఆహారంతోపాటు తోడు కోసం జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో ప్రవేశిస్తుంటాయి. భీంపూర్, జైనథ్, తాంసి, బోథ్, గాదిగూడ, నార్నూర్ మండలాల్లోని అడవుల్లోకి పులులు వస్తుంటాయి. జిల్లాలో గతేడాది బోథ్, ఉట్నూర్ మండలాల్లో జానీ అనే పులి పశువులపై దాడి చేసింది. ఈ పులి గాదిగూడ అడవుల మీదుగా మహారాష్ట్రలోకి తిరిగి వెళ్లిపోయిందని అటవీశాఖ అధికారులు గుర్తించారు.


### పత్తి రైతుల ఆందోళన

బజార్‌హత్నూర్, ఆదిలాబాద్ రూరల్ మండలాల్లో సోమవారం పులి సంచరిస్తున్నట్లు ప్రచారం జరిగింది. పత్తి చేలలోని రైతులు తాము పులిని చూసినట్లు చెప్పడంతో అటవీశాఖ అధికారులు ఆ ప్రాంతాల్లో పర్యటించారు. జిల్లాలో ప్రస్తుతం పత్తి సీజన్ ఉండగా రైతులు తమ చేలలో కూలీలతో పంటను తీస్తున్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పత్తి కూలీలపై పులి దాడి, జిల్లాలో సంచరిస్తున్నట్లు ప్రచారం నేపథ్యంలో వారు రైతులు, కూలీలు ఆందోళన చెందుతున్నారు. చేలలో పులులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. శబ్దాల కోసం సౌండ్ బాక్స్‌లను ఉపయోగిస్తున్నారు. పత్తిని తీయడానికి ఉదయం ఆలస్యంగా బయలుదేరి సాయంత్రం తొందరగా ఇంటికి చేరుకుంటున్నారు. పులి సంచారం నేపథ్యంలో గ్రామాల్లో రైతులు అప్రమత్తంగా ఉండాలని, కనపడితే తమకు సమాచారం ఇవ్వాలని అటవీశాఖ అధికారులు సూచిస్తున్నారు.



పిల్లలతో కలిసి కేక్ కట్ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులు

# సమస్యలు తెలుసుకునే స్వేచ్ఛలేకుండా పోయింది



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

లోకేశ్వరం, డిసెంబర్ 3 : కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో విద్యార్థుల సమస్యలు తెలుసుకునే స్వేచ్ఛ కూడా లేకుండా పోయిందని లోకేశ్వరం బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ కరిపే శ్యాంసుందర్ అన్నారు. బీఆర్ఎస్‌వీ గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా లోకేశ్వరం మండల కేంద్రంలో గల బీసీ సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు ఆ పార్టీ నాయకులతో కలిసి సందర్శించేందుకు వెళ్తుండగా స్థానిక పోలీసులు అడ్డుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించడం ఏ మేరకు సమంజసమని ప్రశ్నించారు. అక్రమ నిర్బంధాన్ని సహించేది లేదని విద్యార్థుల కోసం పోరాడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు బండి ప్రశాంత్, దిగంబర్, సాయన్న, అనిల్, హరీష్, నరేశ్ పాల్గొన్నారు.

# ప్రశ్నిస్తే గొంతు నొక్కుతున్నారు?

- **సమస్యలపై మాట్లాడితే అరెస్టులు చేస్తున్నారు..**
- **బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్**

ఉట్నూర్ రూరల్, డిసెంబర్ 3 : గురుకులాల్లో నెలకున్న సమస్యలను తెలుసుకుని సమస్యలపై మాట్లాడితే తమను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని, మాట్లాడితే గొంతు నొక్కుతున్నారని బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ అన్నారు. రెండో రోజైన మంగళవారం ఆయనను ముందస్తుగా అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకుల బాటలో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, ఎదుర్కొంటున్న సమస్యలు బయట పడుతాయనే ముందస్తు అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ అక్రమ అరెస్టులు అప్రజాస్వామికమని అన్నారు. భోజన వసతులు నాణ్యతగా ఉంటే ఫుడ్ పాయిజన్ ఎందుకు అవుతున్నాయో ప్రభుత్వం, అధికారులు తెలుపాలని డిమాండ్ చేశారు. తమను అరెస్టు చేయడం ఆపి, విద్యార్థులకు మెరుగైన వసతుల కల్పనపై దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థుల పక్షాన తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.



బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్‌ను అరెస్టు చేసి స్టేషన్‌కు తీసుకెళ్లిన పోలీసులు

# దూడను హతమార్చిన పులి!

ఇంద్రవెల్లి, డిసెంబర్ 3 : గట్టేపల్లి గ్రామానికి చెందిన మెస్రం బాదిరావు ఐదు రోజుల క్రితం మేత కోసం అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. అటవీ ప్రాంతంలో మేతకు వెళ్లిన దూడ ఇంటికి రాకపోవడంతో చుట్టూ పక్కల గాలించాడు. మంగళవారం ఉదయం గట్టేపల్లి అటవీ ప్రాంతంలో గాలించగా.. అలికోరి అటవీ ప్రాంతంలో పులి దాడి చేసినట్లు కళేబరం దొరకాయని తెలిపాడు. అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకున్నారు. దూడ కళేబరం పరిసరాలతోపాటు అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. దూడ మృతి చెంది సుమారు ఐదు రోజులు కావడంతో పులి సంచరించినట్లు ఎలాంటి అనవాళ్లు దొరుకలేదని ఎఫ్ఆర్వో సంతోష్ తెలిపారు.